క్లుప్తంగా

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

నెహ్రూనగర్: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం జస్టిస్ కె.పున్నయ్య కమిషన్ సిఫార్సులను సమర్థంగా అమలు చేయాలని సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి వీరాంజనేయస్వామిని కలసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలోని ముఖ్యమైన దళిత సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అట్రాసిటీ చట్టాన్ని పటిష్టంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజ్యాధికార సాధనతోనే బీసీ వర్గాల అభివృద్ధి

నెహ్రూనగర్: రాజ్యాధికార సాధనతోనే బీసీ వర్గాల నిజమైన అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు పావులూరి హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం అరండల్‌పేటలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 52 శాతం జనాభా ఉన్న బీసీలు రాజకీయ ఆర్థిక సామాజిక అభివృద్ధి లేకపోవడం దురదృష్టకరమన్నారు. చట్ట సభల్లో బీసీల ప్రాతినిధ్యం కోసం ఈ నెల 26, 27వ తేదీల్లో కడప, అనంతపురంలో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నాయకులు మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పవన్ కళ్యాణ్ విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం

లక్ష్మీపురం: హరిహర వీరమల్లు సినిమాతో డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చరిత్రను వక్రీకరించి, విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉందని ముస్లిం యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ కలీం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్పిత పాత్రలతో మొగల్ రాజులను కించపరిచే విధంగా సినిమా తీయడంపై కుల, మతాలకతీతంగా లౌకికవాదులందరూ విస్మయం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సినిమాల ద్వారా సమాజానికి మంచి సందేశం ఇవ్వాలే తప్ప ఇటువంటి తప్పుడు విధానాలతో కల్పిత పాత్రలతో సమాజాన్ని తప్పు దోవ పట్టించడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు.

చరిత్రను వక్రీకరించి...

లక్ష్మీపురం: చరిత్ర వక్రీకరించి తీసిన సినిమా హరిహర వీరమల్లు అని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ వలి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. డెప్యూటీ సీఎం పదవిలో ఉండి పవన్ కళ్యాణ్ ఇటు వంటి చరిత్ర వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు.

తప్పుడు మార్గాల్లో పయనిస్తే భావి జీవితం అంధకారం

డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో తప్పుడు మార్గాల్లో పయనిస్తే భావి జీవితం అంధకారంగా మారుతుందని ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. జేకేసీ కళాశాలలో గురువారం మాదక ద్రవ్యాలు– వాటి దుష్పరిణామాలు, ఈవ్ టీజింగ్, రాష్ డ్రైవింగ్‌పై ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో క్రమశిక్షణతో మెలగాలని, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ వంటి దుశ్చర్యలకు పాల్పడిన పక్షంలో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. సోషల్ మీడియాను విజ్ఞానాభివృద్ధి కోసం వినియోగించాలని, ముఖ్యంగా విద్యార్థినులు ఇన్‌స్ట్రాగాం, ఫేస్‌బుక్‌ల ద్వారా అపరిచిత వ్యక్తుల పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. సదస్సులో సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ నూతక్కి నరహరి, బి.నారాయణ, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్‌లో ఉద్యోగంలో చేరిన కళాశాల పూర్వ విద్యార్థిని ఎం.కృష్ణకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపీచంద్, పి.నాగసుశీల పాల్గొన్నారు.

అమ్మతనంపై చిగురిస్తున్న ఆశలు

నేడు వరల్డ్ ఐవీఎఫ్ డే

- ఆధునిక వైద్యసేవలతో సంతానానికి అవకాశం
- దంపతుల్లో పెరుగుతున్న సంతానలేమి సమస్య
- ఆధునిక జీవనశైలి కారణం
- సంతానం కోసం వైద్యులను సంప్రదిస్తున్న జంటలు
- గుంటూరులో ఐవీఎఫ్ కేంద్రాలు



గుంటూరు మెడికల్: అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. ఆధునిక జీవనశైలి వలన ప్రస్తుతం సంతానలేమి సమస్యలు పెరిగిపోతున్నాయి. ఒకప్పుడు సంతానలేమి సమస్య ఏడుశాతం ఉండేదని నేడు రెట్టింపు అయినట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. వైద్యసేవలను అందించేందుకు ప్రత్యేక ఆస్పత్రులు, ఐవీఎఫ్ సెంటర్స్ గుంటూరులో నూతనంగా చాలా వచ్చాయి. జూలై 25న వరల్డ్ ఐవీఎఫ్ డేగా నిర్వహిస్తున్నారు.

మగవారిలో సంతానలేమికి కారణాలు....

మగవాళ్లలో దీర్ఘకాలిక వ్యాధులైన బీపీ, షుగర్ సంతానలేమికి దారితీస్తోంది. స్మోకింగ్, ఆల్కహాల్, డ్రగ్స్, కొన్ని రకాల మందులు వాడటం వలన కూడా సంతానలేని సమస్య ఉత్పన్నమవుతుంది. సుఖవ్యాధులు, టీబీ, బీర్జాలకు గాయాలు అవ్వటం, దెబ్బలు తగలటం, అంగం సైజుల్లో తేడాలు, పని ఒత్తిడి వలన సంతానలేమి సమస్యలు వస్తున్నాయి.

ఆడవారిలో పిల్లలు పుట్టకపోవటానికి కారణాలు

పెళ్లైన ఏడాది పాటు ఎలాంటి గర్భ నిరోధక పద్ధతులు పాటించకుండా దాంపత్య జీవితాన్ని కొనసాగించినా గర్భం రాకపోవటాన్ని వంధత్వం(ఇన్‌ఫెర్టిలిటి) అంటారు. ఆడవాళ్లలో సంతానలేమికి కారణాల్లో ఆలస్యంగా అంటే 35 సంవత్సరాల వయసులో పెళ్లి చేసుకోవటం. ఆలస్యంగా రజస్వల అవ్వటం. అండం విడుదల అవ్వకపోవటం, హార్మోన్ల సమస్య, గర్భసంచి, కడుపులో ఇన్‌ఫెక్షన్లు, గర్భసంచి ట్యూబ్‌లు మూసుకుపోవటం, పిసిఓడి, జునైటైల్ టీబీ, బీపీ, షుగర్, జీవనశైలి, అధిక మానసిక ఒత్తిడి, అధిక బరువు, అండం విడుదల జరిగే సమయంలో దాంపత్యంలో పాల్గొనకపోవటం, దాంపత్యం కోసం మూఢ నమ్మకాలు పెట్టుకుని ఆచరించటం, సెక్స్‌పై అవగాహన లేకపోవటం తదితర కారణాలు ఉన్నాయి.

కంప్యూటర్‌ను 6 నుంచి 8 గంటలపాటు వినియోగించటం, రాత్రివేళల్లో ఎక్కువగా సెల్‌ఫోన్ మాట్లాడటం, వీర్యకణాలు తక్కువగా ఉండటం, రాత్రివేళలో నిద్రపోకుండా ఉండటం, హార్మోన్ సమస్యలు, గర్భనిరోధక సాధనాలు ఎక్కువగా వాడటం వలన సమస్యలు వస్తున్నాయి.

ఆధునిక చికిత్సలతో సంతానం....

సంతానం కోసం అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. సంతానం కోసం ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి రెండు నుంచి ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో పిండాన్ని పెడతారు. భర్త శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధానం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా బీర్జాల్లో నుంచి సిరంజిద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి పిండాన్ని తయారు చేసి గర్భంలో పెడతారు. ఇంట్రాయుటైన్ ఇన్‌సెమినేషన్ (ఐయుఐ) విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు. భార్య గర్భసంచి పిండం మోసే స్థితిలో లేకపోయినా, ఆమె ఆరోగ్యరీత్యా గర్భం రాకూడదని వైద్యులు నిర్ధారిస్తే సరోగసి ద్వారా(అద్దె గర్భం) సంతానం పొందవచ్చు.

అందుబాటులో ఆధునిక వైద్యం



నూతన వైద్య విధానంలో సంతానలేమి సమస్యతో వచ్చిన వారు ఆస్పత్రిలో వైద్యం పొందిన పిదప సంతానం పొందుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సంతాన భాగ్యం కలిగిస్తోంది. గుంటూరు నగరంలో అత్యాధునిక చికిత్సా పద్ధతులు మా హాస్పిటల్‌లో అందుబాటులోకి తీసుకొచ్చాం. ఐవీఎఫ్ చికిత్సల్లో నేడు రొబొటిక్ ఇక్సీ విధానం, నానో రోబోస్ సాంకేతిక పరిజ్ఞానం కూడా పలు దేశాల్లో అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా కచ్చితత్వం ఎక్కువగా ఉంది.

డాక్టర్ ఇంద్రకంటి నాగ ప్రత్యూష,
ఐవీఎఫ్ నిపుణురాలు

ఆరోగ్య కరమైన సంతానం కోసం....



ఆరోగ్యకరమైన సంతానం పుట్టేందుకు 23 నుంచి 28 ఏళ్ల వయసు చాలా అనుకూలం. గర్భం దాల్చేందుకు ముందుగానే ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవటం చాలా మంచిది. గర్భం దాల్చిన 13 వారాలలోపు న్యూకల్ ట్రాన్స్ ల్యూసెన్సీ(ఎన్‌టీ) స్కాన్ చేయించాలి. డబుల్‌మార్కర్ టెస్ట్, క్రోమోజోన్ ఎనాలసిస్ టెస్ట్, షుగర్ టెస్ట్, రక్త హీనత టెస్ట్ చేయించాలి. 18 వారాల నుండి ఐరన్‌మాత్రలు, ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం మాత్రలు, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజెక్షన్లు చేయించాలి.

–డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి,
స్త్రీ, ప్రసూతి, సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు

బాధితులు అధికమే...



సంతానలేమి సమస్యతో బాధపడుతున్నవారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోవటం చాలా ఆందోళన కలిగించే విషయం. జిల్లాలో 300 మంది గైనకాలజిస్టులు ఉన్నారు. సంతాన సాఫల్య కేంద్రాలు 11 ఉన్నాయి. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతి రోజు ఒకరు సంతాన లేమి చికిత్స కోసం సంప్రదిస్తున్నారు. వివాహమైన ఏడాదిలోపు గర్భం దాల్చకపోతే వెంటనే ఐవీఎఫ్ నిపుణులను సంప్రదించటం ద్వారా త్వరగా సంతానం పొందే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్,
సీనియర్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్

భగవద్గీత జ్యోతిపై ప్రవచనం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై గురువారం భగవద్గీత జ్యోతి–మనో మార్గదర్శి జుగల్బందీ వ్యాఖ్యాన పూర్వక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. కోట రామలక్ష్మి భగవద్గీతలోని శ్లోకాలను పఠించారు. భగవద్గీతలోని అంతరార్థాలను విపులంగా వివరించారు. కాటూరి వైద్య కళాశాల మానసిక వైద్య అధ్యాపక వైద్యులు కోట సురేష్‌కుమార్ భగవద్గీతలోని పాత్రలు, వారి ప్రవర్తన, సుఖ దుఃఖాల సమాహారాన్ని, మానసిక స్థితులను తెలియజేశారు. భగవద్గీతను అనుసరించి నేటి కాలంలో మానవులు అనుసరించాల్సిన నీతి, నియమాలను తెలిపారు.

బీరు సీసాతో దాడి చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని బీరు సీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనివాసరావు పేటకు చెందిన తన్నీరు సునీల్‌కుమార్ కారు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే ద్విచక్రవాహనం లేకపోవడంతో సునీల్ స్నేహితుడు రాకేష్‌కు సాయంత్రం ఫోన్ చేసి విద్యానగర్ వరకు వెళ్లేందుకు రావాల్సిందిగా పిలిపించుకున్నాడు. ఇద్దరు కలిసి వాహనంపై వెళుతుండగా శ్రీనివాసరావు పేట వడ్డేరగూడెం వద్ద దేవరాజు అనే వ్యక్తి పూటుగా మద్యం తాగి వాహనాన్ని అడ్డగించాడు. సునీల్‌ను మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాల్సిందిగా దేవరాజు నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా దేవరాజు బీరు సీసాతో సునీల్‌పై దాడి చేసి గాయాలు పాలు చేయడంతో స్థానికుల సహాయంతో జీజీహెచ్‌లో చికిత్స పొందారు. అనంతరం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలం చెల్లినా.. అంటగట్టేస్తాం...

- మార్కెట్‌లో యథేచ్ఛగా నకిలీ.
- నాణ్యతలేని వస్తువుల విక్రయాలు
- అప్రమత్తతతోనే అడ్డుకట్ట వేయగలం
- మొద్దునిద్ర పోతున్న ఫుడ్, తూనికలు కొలతల శాఖ అధికారులు



మార్కెట్‌లోని ఒక దుకాణంలో 2024లోనే కాలం చెల్లిన తేనె బాటిల్‌ను విక్రయించిన దృశ్యం

పట్నంబజారు: నగరంలోని పట్నంబజారు వాణిజ్య, వ్యాపారాలకు పెట్టిన పేరు. ఏదీ కావాలన్న గృహోపకరణాలకు ఇక్కడ లభించని వస్తువులు ఉండవు. అటువంటి పరిస్థితుల్లోనే.. వ్యాపారల సముదాయాల ప్రాంతం కల్తీలకు.. కాలం చెల్లిన వస్తువుల ఖిల్లాగా మారిపోయింది. ఓ భక్తుడు పూజా సామాగ్రిని కొనుగోలు చేస్తే కాలం తీరిన తేనే బాటిల్ వచ్చింది. అది ఆయన ఆలయంలో అర్చకులకు ఇస్తే.. స్వామి వారికి నివేదించి తీర్థంగా ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. తనిఖీలు చేయాల్సిన అధికారులు మాత్రం మూగనోమును తలపించేలా వ్యవహరిస్తున్నారు. మనం కొనుగోలు చేసే ప్రతి వస్తువులోనూ.. ఎటువంటి లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉంది. అయితే ప్రస్తుతం మోసాలు ఎక్కువైపోయాయి. మరోవైపు వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు, కనీసం వాటిపై దృష్టి సారించటం లేదు.

ఇలా ఫిర్యాదు చేద్దాం..

వినియోగదారులు నష్టపోయామని భావిస్తే జిల్లాలో అయితే డీసీఐసీ, మండలాల్లో అయితే ఎంసీఐసీ ద్వారా కేవలం తెల్లకాగితంపై రాసి ఇస్తే సరిపోతుంది. అయితే కచ్చితంగా రసీదు ఉండాలి. విక్రయించే ప్రతి వస్తువుపైనా ఎమ్మార్పీ తయారు చేసిన తేదీ, ఎక్స్పైరీ డేట్, వినియోగదారుల హెల్ప్ లైన్ చెందిన నంబరు విధిగా ముద్రించి ఉండాలి. అలా లేకపోతే వస్తువుల విక్రయ దుకాణాలపై ప్రభుత్వం జరిమానా విధించాలి. అనుమతి లేకుండా సినిమా టికెట్లు అధిక ధరలకు అమ్మినా, తూకాల్లో తేడాలున్నా, సేవల్లో లోపాలను పసిగట్టినా ఫిర్యాదు చేయొచ్చు.

చట్టంపై అవగాహన అవసరం..

వినియోగదారుల రక్షణ చట్టం– 2019 ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి. నాణ్యత లేని ఉత్పత్తులు, తప్పుడు ప్రకటనలు, అధిక ధరలు, సరైన సేవలు అందక పోవడం వంటి సమస్యల నుంచి పరిహారం కోసం వినియోగదారులకు రక్షణ చట్టం అమల్లో ఉంది. మారుతున్న కాలానికి, సాంకేతిక సౌలభ్యానికి అనుగుణంగా ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్‌పై నియంత్రణ ఈ చట్టంలో ఉంది. జిల్లా కమిషన్ ఎదుట కోటి రూపాయల లోపు, రూ. కోటి నుంచి రూ.10 కోట్ల మధ్య రాష్ట్ర కమిషన్ ఎదుట, రూ.10 కోట్ల పైబడిన కేసులు జాతీయ కమిషన్ ఎదుట దాఖలు చేయవచ్చు. వినియోగదారులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది.

గుర్రం జాషువా చిరస్మరణీయుడు



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నూరిఫాతిమా తదితరులు



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ తదితరులు

పట్నంబజారు: మహాకవి గుర్రం జాషువా వర్ధంతిని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్యాలయంలో జాషువా చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన కవితలతో సమాజంలోని అంటరానితనంపై పోరాడిన మహనీయుడు జాషువా అని కీర్తించారు. ఆయన కవిత్వం ప్రతి ఒక్కరిని ప్రేరేపించిందని, అన్యాయానికి ఎదురుగా ప్రశ్నించే తత్వాన్ని నేర్పించిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు నందేటి రాజేష్, పూనూరి నాగేశ్వరరావు, మల్లవరపు రమ్య, చీదర్ల రాజేష్, షంషేర్, చిలకా రమేష్, తుమ్మేటి శ్రీను, రమేష్, పసుపులేటి రామయ్య, దూపాటి సాల్మన్, నారకట్ల శ్రీను పాల్గొన్నారు.

జాషువా సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

లక్ష్మీపురం: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని విజ్ఞాన కేంద్రంలో జాషువా వర్ధంతి గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, వివిధ ప్రజాసంఘాల నాయకులు ఈమని అప్పారావు, కాకుమాను నాగేశ్వరరావు, బెర్రగాని శ్రీనివాసరావు, వై.కష్టకాంత్, షేక్ ఖాశిం షహీద్, వై.కృష్ణ, నారాయణ పాల్గొన్నారు.



జాషువా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రజక జన సేవాసంఘం సభ్యులు

గుర్రం జాషువా ఆశయాలను కొనసాగించాలి

నెహ్రూనగర్: గుర్రం జాషువా రచనలు, సిద్ధాంతాలు అనుసరణీయమని రజక జన సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాషువా వర్ధంతి సందర్భంగా నగరంపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్, విప్పర్ల ముత్తయ్య, డెన్నిస్ రాయ్, వట్టికూటి సాంబయ్య, రవిబాబు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత

నెహ్రూనగర్: సమస్త జీవులకు ప్రాణ దాతలైన మొక్కలను నాటి వాటిని చెట్లుగా మలచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మేరా యువ భారత్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ అంశుమన్ ప్రసాద్ దాస్ పేర్కొన్నారు. గురువారం మేరా యువ భారత్, గుంటూరు ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలో ఏక్ పెడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

బహిరంగ ప్రకటన

గుంటూరు జిల్లా, [illegible] మండలం, వేజెండ్ల గ్రామ కాపురస్తులు ప్రస్తుతం [illegible] గుంటూరు టౌన్ కాపురస్తులు డోర్. నెం.124-2-583,కోట్ల వెంకటేశ్వర రెడ్డి గారి కుమారుడు [illegible] యావన్మందికి తెలియజేయునది ఏమనగా
[illegible] డాక్యుమెంట్ నెం.2905/2011 [illegible] ఫోటోస్టాట్ [illegible]
సీతారామిరెడ్డి, అడ్వకేటు
1/7, బ్రాడీ పేట, గుంటూరు,
సెల్ : 9885035785.

బహిరంగ ప్రకటన

పల్నాడు జిల్లా, అమరావతి మండలము, నెమలికల్లు గ్రామ కాపురస్తులు ప్రస్తుతం [illegible] విప్పుల సుబ్బారెడ్డి గారి కుమారుడు [illegible] శంకర్‌రెడ్డి [illegible] యావన్మందికి తెలియజేయునది ఏమనగా
[illegible] డాక్యుమెంట్ నెం.2130/2011 [illegible]
నా క్లయింట్ ది.10-06-2025న [illegible] కోల్పోవడమైనది.
సీతారామిరెడ్డి, అడ్వకేటు
1/7, బ్రాడీపేట, గుంటూరు,
సెల్ : 9885035785.

రమణయ్య సేవలు చిరస్మరణీయం



అయ్యంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని 28వ డివిజన్ కార్పొరేటర్ పడాల సుబ్బారెడ్డి అన్నారు. గురువారం పట్టాభిపురంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రేడ్–3 గ్రంథ పాలకురాలు పి.సత్యశిరీష, విశ్రాంత సీనియర్ అసిస్టెంట్ ఇమ్రాన్‌ఖాన్, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల ప్రాధాన్యం చాటిన అయ్యంకి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాల ప్రాధాన్యం చాటిన అయ్యంకి వెంకట రమణయ్య స్ఫూర్తితో విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని ఆర్జించాలని హిందూ కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్ పేర్కొన్నారు. గురువారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల గ్రంథాలయంలో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు డీవీ సుబ్బారావు, గ్రంథాలయ అభివృద్ధి సంఘ సమన్వయకర్త సీహెచ్ అరుణ, మహిళాభివృద్ధి విభాగ కన్వీనర్ వి.బ్యూలారాణి, సహాయ గ్రంథ పాలకురాలు శ్రీజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక శ్రేయో రాజ్య స్థాపనే లక్ష్యం

సీపీఐ నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం: కార్మిక, కర్షక శ్రేయో రాజ్య స్థాపనే లక్ష్యంగా సీపీఐ ముందుకు సాగుతోందని పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ గుంటూరు నగర 25వ మహాసభలు శారదాకాలనీలోని మంద రమణయ్య వేదికపై గురువారం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో కూడా సీపీఐ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి పగులగొట్టమన్న కూటమి నేతలు ప్రస్తుతం వారి పాలనలో అవే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ గుంటూరులో కోల్డ్ స్టోరేజ్ లో మిర్చి తగులబడిన ఘటనలో రైతులకు న్యాయం చేయడంతో పాటు ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కాదు... పోరాటమే సరైన మార్గమంటూ అగ్రిగోల్డ్ బాధితులకు రూ.9 వేల కోట్లు ఇప్పించిన ఘనత ముప్పాళ్ల నాగేశ్వరరావుకు దక్కుతుందని చెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీవరప్రసాద్ మాట్లాడారు. అనంతరం కోట మాల్యాద్రి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. మహాసభలో సీపీఐ నాయకులు జి.సురేష్, దేవానాయక్, చల్లా మరియదాసు, విజయకుమార్, మున్నా, మంగా శ్రీనివాసరావు, యశ్వంత్ పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధికి ఆదాయపు పన్ను ఎంతో కీలకం

ఆదాయపు పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ ప్రేమ్‌సాగర్



విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఆదాయపు పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ఆర్థికాభివృద్ధికి ఆదాయపు పన్ను ఎంతో కీలకమని ఆదాయపు పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ పి.ప్రేమ్‌సాగర్ పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని ఆంధ్ర క్రైస్తవ కళాశాలలో ఆదాయపుపన్ను శాఖ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ 145 కోట్ల జనాభా ఉన్న మన దేశంలో ఉన్న సుమారు 7.50 కోట్ల మంది పన్ను చెల్లింపు దారుల నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తున్న తీరును వివరించారు. అనంతరం ఆదాయపు పన్నుపై వీడియోను ప్రదర్శించి, విద్యార్థులకు పది ప్రశ్నలతో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటి విద్యార్థుల ప్రయోజనార్థం కళాశాలలోని గ్రంథాలయానికి వివిధ రకాల పుస్తకాలను బహూకరించారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొమ్మాలపాటి మోజస్, వైస్ ప్రిన్సిపాల్స్ జీపీ శాలిని, డాక్టర్ బి.విజయ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పీఎం వినయ్‌తేజ, కామర్స్ విభాగాధిపతి టి.చంద్రబాబు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధికి ఆదాయపు పన్ను కీలకం

దేశ ఆర్థికాభివృద్ధికి ఆదాయపు పన్ను కీలకమైనదని ఆదాయ పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి.వేణుగోపాల్ పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో కామర్స్ విభాగ ఆధ్వర్యంలో ఆదాయపు పన్ను దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వేణుగోపాల్ మాట్లాడుతూ ఆదాయపు పన్ను ప్రాధాన్యం, పౌరులు బాధ్యత వివరించారు. ఆదాయపన్ను దేశాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విశ్వం, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ కామర్స్ విభాగాధిపతి డాక్టర్ పి.వేణుగోపాల్, ఆదాయపు పన్ను శాఖ సూపరింటెండెంట్ రామకృష్ణారావు, అధ్యాపకులు కె.రాంబాబు శ్రీలేఖ, శరత్ కుమార్ పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులతోనే దేశ ఆర్థికాభివృద్ధి

బాధ్యతాయుతమైన పన్ను చెల్లింపుదారులు దేశ ఆర్థికాభివృద్ధికి పునాదులుగా నిలుస్తున్నారని ఆదాయపు పన్ను శాఖాధికారి కె.సత్యనారాయణ పేర్కొన్నారు. శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదాయపు పన్ను దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ జూలై 24న దేశవ్యాప్తంగా ఆదాయపు పన్ను దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

31లోగా మీడియా డిస్‌ప్లే ఫీజు బకాయిలు చెల్లించాలి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని మీడియా డివైజ్ డిస్‌ప్లే బోర్డ్స్ నిర్వాహకులు ఈ నెల 31వ తేదీలోగా బకాయిలు మొత్తం చెల్లించాలని, చెల్లించని వారి బోర్డులను ఆగస్టు ఒకటో తేదీ నుంచి తొలగించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో మీడియా డివైజ్ డిస్‌ప్లే బోర్డ్స్ నిరాహకులతో ఫీజుల బకాయిలపై ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 31 సాయంత్రానికి సమగ్ర నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. నగరంలో ఆగస్టు ఒకటి నుంచి అనధికార, బకాయిలు ఉన్న సంస్థల ప్రకటనల బోర్డ్‌లు, హోర్డింగ్స్ ఉండడానికి వీలు లేదన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com